# పాపం మగాడు!

చిరిగిపోయిన చీర చెరుగుల్లోంచి పొంగుకొస్తున్న అంగ సౌష్టవం రెండు పదులు దాటని ఆమె వయస్సుని చెప్పక చెబుతోంది. తైల సంస్కారం లేకపోయినా బొద్దుగా ఎదిగిన జుట్టూ, స్నానం లేక దూళితో నిండిన పచ్చని శరీరచ్ఛాయతో చలాకీగా తిరుగుతూ అడుకుంటున్న ఆమెను చూస్తుంటే, కాస్త సంరక్షణ వుంటే ఆమె మంచి అందగత్తె అని, చలాకీ పిల్లనని అనిపించింది. "ఏమిటలా తిరిగి తిరిగి చూస్తున్నావ్ దాన్ని?" అన్నారాయన నన్ను చూసి. "ఆ పిల్ల - అంత అందమైన పిల్ల అలా అడుక్కుతింటూంటే, బాధగా లేదూ? పైగా ఎంతో చలాకీగా వుంది కదూ?" అన్నాను. మావారు ఏ కామెంటూ చెయ్యకుండా నవ్వేసి ఊరుకున్నారు అయనలా వూరుకోవడం నచ్చని నేను "ఎందుకు నవ్వుతారు?" అంటూండగానే ఆ అమ్మాయి మావారి దగ్గరికొచ్చి "ఒక్క రూపాయి దానం చెయ్యండమ్మా!" అంది. ఆయన నాకేసి చూసారు. నా పర్సులోంచి రూపాయి తీసి ఆ అమ్మాయి కిచ్చాను. నవ్వుతూ సంతోషంగా నాకేసిచూచి రూపాయి అందుకుంది. అమె కళ్ళల్లో నిండిన ఆనందం, నా మనసు కేదో తృప్తి కలిగించింది. ఒక్క క్షణంతో ఆ పిల్ల కనుమరుగై పోయింది ఆ జన సమూహంలో. నాటి నుంచి ఆమె రూపం నాలో అలా నిల్చి పోయింది. అబిడ్స్ మీదుగా పోయినప్పుడల్లా, నా కళ్ళు ఆమె కోసం వెతుకుతూనే వున్నాయి. నెలలూ, సంవత్సరాలూ దాటడంతో క్రమేణా ఆమెను మరిచిపోయాను.

దాదాపు మూడు సంవత్సరాలు దాటాయి. ఒకరోజు మధ్యాహ్నం సికింద్రాబాదులోని మోండా కూరల మార్కెట్టుకి కూరలు కొందామని బయలుదేరాను. మార్కెట్టుకి ఒక ఫర్లాంగు దూరంలో జనం గుంపులు గుంపులుగా

నుంచున్నారు. "ఆక్సిడెంటేమో!" గుండె దడదడా కొట్టుకుంది, "అమ్మో! బాబో! నన్ను కొట్టకండి. నే చెప్పేది వినండి" అంటూ మొత్తుకుంటున్నా వినక చావబాదుతున్నారు జనం అతణ్ణి. "బాగా తన్నండి, బుద్ధొచ్చేలా తన్నండి. రౌడీ వెధవ" అంటోంది ఆవిడ, కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ. కొందరు ఆమె నోదారు స్తున్నారు. ఆయన పక్కనుంచే ఆగనిచ్చేవారు కాదుగాని, నేనొక్క దాన్నే వుండడంవల్ల సంగతేమిటో తెలుసుకుందామని ఆగాను. చాక్లెట్ రంగు మీద గులాబీ రంగు పూలున్న సిఫాన్ చీరా, చాక్లెట్ రంగు బ్లౌజూ, కళ్ళకి కాటుక, పెదవులకి ఎర్రటి లిప్‌స్టిక్కూ, చిన్నగా జుట్టుముడి, హై హీల్సు, హ్యాండ్ బ్యాగ్ ఎంతో అధునాతనంగా నాజూగ్గా వున్న ఆమెను చూడగానే నేను అలాగే నుంచుండి పోయాను.

వెంటనే ఫ్లాష్‌బాక్‌లా గుర్తుకొచ్చింది "ఒక రూపాయి దానం చెయ్యం డయ్యా!" అన్న రూపం. ఆశ్చర్యంతో గుండె ఆగిపోతుందేమోననిపించింది. ఎలా సంభవమిది? సినిమా షూటింగ్ కాదు కదా అని అనుమానం వచ్చి కలియజూశాను. ''కొట్టకండి బాబూ, నే చెప్పేది వినండి'' అని అతను గోల పెడుతున్నా బాదుతూనేవున్నారు జనం. కసితీరక, అతని చొక్కా చింపేశారు. జుట్టు పీకేశారు. ''ఇక చాల్లెండి, కొంపదీసి వాడు చస్తే డేంజరు" అన్నాడొక తను. బహుశ కొట్టి కొట్టి అతని చెయ్యే నొప్పెట్టింటుంది. అందరూ ఒక్క సారిగా కొట్టడం ఆపేశారు. అందరి కళ్ళూ అటు కేసి చూశాయి. ఆమె రివ్వున ఆటోలో కూర్చుని, వెళ్ళిపోయింది.

ఆమె మెప్పును పొందుదామనుకున్న పెద్ద మనుషులందరూ, ఆమె చిటికెలో మాయమవడం చూసి నీరుకారిపోయారు. నిశ్చేష్టులయ్యారు. ఆ దెబ్బలు తిన్న వాడు కళ్ళు తుడుచుకుంటూ ఇలా అన్నాడు:

''ఇప్పుడైనా అసలు సంగతి వినండి. ఈమె ఒక పెద్ద కిలాడీ. నేను ఇక్కడ ఒక క్లబ్బులో క్లర్కుగా పనిచేస్తున్నాను. టిప్‌టాప్‌గా డ్రెస్ చేసుకుని, ఈ ఆటోలో వచ్చి మా దుకాణంలో ఏవేవో వస్తువులు, సంతకంచేసి తీసుకుంది. ఏ మెంబరు భార్యోనని మేము ఊరుకున్నాం. నెలాఖరుకి తేలింది ఆ పేరుతో ఎవరూ లేరని, ఆమె చేసింది దొంగ సంతకమని, ఈసారి మళ్ళీ వస్తే పట్టు

కుందామని పెద్దలంతా నిశ్చయం చేశారు. మూడు నెలల తరువాత ఇవ్వాళ మళ్ళీ వచ్చింది. మా వాళ్ళు ఆమెను నిలదీసి అడిగేసరికి ఆమె తప్పును ఒప్పు కుంది. పోలీస్ స్టేషనుకి ఈమెను అప్పగించమని నన్ను పంపారు. కొంత దూరం వచ్చే సరికి 'రక్షించండి, హెల్ప్ హెల్ప్' అంటూ ఈమె అరవడం, మీరందరూ మూగి నన్ను బాదడం జరిగింది ఈలోగా ఆమె ఆటోలో తుర్రు మంది. అసలు ఈ పెద్దమనుషులకు తెలివిలేదుగానీ, ఇలా నన్నిచ్చి ఈ కిలా డీతో పంపడమేమిటి? పోలీసులని అక్కడికే రప్పించి వుంటే ఈపాటికి ఆటోలో కాదు - పోలీసు వ్యానులో వెళ్ళుండేది. ఇంతకీ నా ఖర్మ. దెబ్బలు తినే గీత రాసుంది ఇవ్వాళ్ళ నాకు'' అంటూ చిరిగిపోయిన చొక్కావంక బాధగా చూసు కుంటున్న అతన్ని చూస్తూ అందరూ గుడ్లప్పగించారు ఆశ్చర్యంతో. కథ లాగా వింటున్న నా చెవులతోపాటు తెరుచుకున్న నోరు మూతపడలేదు.

''పాపమండీ!" అని నేనన్నప్పుడు అయన నా మాటలకి ఆనాడు ఎందుకు నవ్వారో ఇప్పుడు అర్థమయింది నాకు. ఇంక మార్కెట్టుకి వెళ్ళడానికి మనసొప్పక, పిచ్చిదానిలా "అబలా, యెంత పని చేశావ్?" అనుకుంటూ ఇంటి మొహం పట్టాను.

అంతుపట్టలేదు అబల-ఆడదా? దెబ్బలు తిన్న ఆ క్లర్కా?

"పాపం, మగాడు!'' అనిపించింది ఆ క్షణంలో!

*